కవితా కౌముది

## తపస్సు

చందలూరి నారాయణ రావు

పొలం మంచంపై
మట్టి దుప్పటి కప్పుకున్న
మొలక రాక కోసం
గట్టు కన్నార్పకుండా ఎదురు చూస్తుంటే
కాలువ ముద్దాడాలని ఉబలాటపడుతుంది.
నారు పోసిన చేతులు
కలుపు తీసిన నడుము
సాలు సాలును పలకరించుకుంటూ
పైరు కలకు అల్లుకుని
కష్టాన్ని చెమర్చుతూ
పచ్చగా "సాగు"తున్నాయి.
పచ్చని పట్టు చీరను చుట్టుకున్న
పొలం ముఖానికి
మట్టి ఆకాశం నడుమ
మనిషి నూర్చపడి
చిందిన చెమట చుక్క
దిష్టి చుక్కగా మారి
పంట ఫలించాలని
తపస్సు చేస్తుంది.



# ఒక క్షణం నిరీక్షణం అర్చన కోవూరు

గెలుపు ఓటముల మధ్య దూరం
ఒక క్షణం ప్రయత్నం,
మంచి చెడుల మధ్య దూరం
ఒక క్షణం ఆలోచన,
మాట మింగుట జారుట మధ్య దూరం
ఒక క్షణం సహనం,
చావుకి పుటుకకి ముందున్న దూరం
ఒక క్షణం వేదన,
భయము ధైర్యము మధ్య దూరం
ఒక క్షణం ఆత్మ విశ్వాసం,
స్నేహానికి వైరానికి మధ్య దూరం
ఒక క్షణం చిరునవ్వు,
నిరాశ ఆశకి మధ్య దూరం
ఒక క్షణం నమ్మకం,
అందం వికారంకి మధ్య దూరం
ఒక క్షణం అనుభవం,
ఆలోచనకి ఆవేశానికి మధ్య దూరం
ఒక క్షణం వివేకం,
మౌనానికి మెచ్చుకోలుకి మధ్య దూరం
ఒక క్షణం స్పందన..!!

క్షణము నందు దాగుంది
మనిషి ఎంచు జీవితం
విచక్షణ కలిగి నడుచుకుంటె
అనుభూతి విలువ శాశ్వతం

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నటనమాడునెప్పుడు విపినమున నెమలి
వారణమ్ములు నడుచునొయ్యారమొలుక
చెట్ల యాకులు కదలాడు చెన్ను మీర
ప్రకృతి యెల్లను హొయలు మీరంగ కదలు

కదలు లయబద్ధముగ వెనుకడలి యలలు
అటునిటు కదలు వరిచేలు నటనమట్లు
అలరులవి తలలూచు నాట్యమ్ము వోలె
ప్రకృతి యెల్లను కదలాడు పరవశమున

సాగు సెలయేరొసంగును సరిగమలను
ప్రచురఘోషలతోడ పర్జన్యమొసగు
తకిట తకధిమి యంచును తాళగతుల
ప్రకృతి యెల్లను సంగీతవాద్యమయము

శాంతరౌద్రాద్భుతములు హాస్యకరుణాది
రసములెల్లెడ నిండిన వసుధ యిద్ది
భూరి రంగస్థలమ్మిది పొడగనంగ
చిరమహానందకర రససిద్ధి యిద్ది

నవనవోన్మేషమైనది నాట్యహేల
సృష్టి యెల్లను నిండు విస్పష్టలీల
కదలునడుగులు కదలును కరయుగమ్ము
మనసు కదలును కలతలు మరలిపోవు

COMMENTS